# నవ్వులాటక

సమీరుడు నాకు బావమరిది వరుస. అతడు చామన ఛాయగల పొట్టిమనిషి. అయితే స్ఫురద్రూపి, మాకు చిరపరిచితుడు. అందుచే మా కాంతంతో చనువుగా మాట్లాడుతాడు. అతడువచ్చి వీధిగదిలో కూర్చున్నాడని నాకు లోపలికి కబురు వచ్చింది.

నేనూ స్నానం ధౌతవస్త్రము ధరించి కేశ సంస్కారము చేసుకొని వచ్చినాను. ఇద్దరం చెరియొక కుర్చీలో కూర్చున్నాము. సమీరుడికి ఒక సిగరెట్టు యిచ్చి నేనూ ఒకటి వెలిగించినాను. అతను అన్నాడు,

"అయితే నామీద నీకు దయ తప్పినట్లుంది?"

"ఎందుకు అల్లా అంటున్నావు? అల్లా జరుగుతుందా? మన స్నేహం, ఆచంద్రతారార్కం అల్లా ఉండాల్సిందే!"

"ప్రతి సంవత్సరాదిని మనము అంతా కలసి కొంత కాలము హాయిగ గడుపుదామని అనుకొన్నాము. మొన్న మొన్నటి వరకు అల్లాగే జరిగింది. కాని మొన్న పోయిన సంవత్సరాదికి నీవు నన్ను ఆహ్వానించకపోవటం నాకు చాలా మనస్తాపం కలిగించింది. నన్నెందుకు పిలువలేదు?"

"కొంచెము నిదానించు, చెబుతాను. తెలుసుగా మీ చెల్లెలు కాంతం విషయమై!"

"మా చెల్లెలు కాంతం విషయమై పూర్తిగా తెలుసు. ఏ విషయంలోను ఏమి అంటానికీ ఆస్పదం లేదు. ఆమె దొడ్డ ఇల్లాలు. నా యందు ఆమెకు మిక్కిలి దయ. ఆమె నాకు ఆహ్వానం పంపవద్దు అని అన్నదని కాని, ఆమెకు నా యందు దురభిప్రాయము ఉందనికాని అంటే నేను విశ్వసించను."

"సమీర్! ఆమె విషయమై నీవు ఇట్టి అభిప్రాయాన్ని వెలిపుచ్చటం నాకు నిజంగా మనోరంజకంగా వుంది. నీకు ఆమె యందుండే అభిమానం కూడ మహా గొప్పది. అయితే నిజం చెప్ప తప్పదు కదా? నిన్ను పిలుచుటకు ఆమెకు ఇష్టం లేకపోవుటచేత యీ ఉగాదికి మిమ్ములను పిలువలేదు."

"నీ మాటలు చాలా విచిత్రంగా వున్నవి. ఆమె ఇది వరలో నా యందు చూపిన ఆదరము, ప్రేమ అద్వితీయము, ఇట్లు నన్ను పిలువద్దు అంటానికి కారణం యేమి? ఇట్టి భావవిప్లవానికి కారణం యేమో నాకు చెప్పాలి."

"చెబుతాను, మన రాముడు నీకు తెలుసునుకదా ?"

"రాముడూ-ఎవరు వాడు ?"

"మా రాముడిని ఎరుగవా ? మా నౌకరు రాముడు."

"వాడా-అవును. వాడిని ఎరుగకేమి ? ఎరుగుదును. వాడు చాలా మంచివాడు సుమీ !"

అల్లాగే వాడిని సేవాపరాయణత్వములో హనుమంతుడితో పోల్చవలె. ప్రతి పని కూడా బహుచక్కగా చేస్తాడు. నా బూడ్సు జోడుకు రంగు వేశాడా అంటే అవి నల్లగా జీడిగింజలవలె నిగనిగలాడుతూ వుంటవి. వాడు బట్టలు, వుతికినాడా అంటే అవి మల్లెపువ్వులవలె తెల్లగా నుంటవి. నేను తాగేమందు ఎక్కడనుంచి తేవలెనో, ఎంత మోతాదు ఇయ్యవలెనో మెలకువలన్నీ తెలుసు."

'అల్లాగా? అయితే ఇది చాలా గొప్పవిషయం.'

'అంతేకాదు. వాడు ఎటువంటి వాడనుకొన్నావు ? బంగారము బజారులో కనిపించినా అసహ్యమైనా వస్తువులాగ చూస్తాడు. పిల్లలను వాడిచేతికిచ్చి షికారు పంపితే జాగ్రత్తగా కాపాడుతాడు. పైకం ఇచ్చి సంతకు పంపినా, బజారుకు పంపినా బహు నేర్పుగా బేరం చేసి సరుకులు తేవటమే కాక ఒక పైసా అయినా తన స్వంతానికి వాడుకోడు."

'అల్లాగా ? నౌకరులలో అంత మంచివాడు ఉండటం అరుదు సుమీ !'

"నీకూ ఆమాటేతోచిందీ ? అయితే వాడికి ఒక దుర్గుణం ఉంది. అదేమిటో తెలుసునా. సౌందర్యపిపాస, ఇదొక్కటే వాడికున్న కళంకం."

"దానికేమిలే ! అదొక పెద్దనీచ గుణంగా ఎంచనక్కరలేదు. వయసుతనంలో అది క్షమార్పణీయము వయసుకు వలపు, చింతకుపులుపు సహజము. సౌందర్య పిపాసాపీడుతుడు వాడు. ప్రేమైక జీవి. అదీకాక నిష్కళంకమైన శీలముగల దేహియెవడు

? చంద్రుడికి కళంకంలేదా ! భగవానుడు అనే అఖండ తేజోమూర్తి అయిన సూర్యుని గర్భంలో మచ్చలున్నవి. దానివిషయమై నీవు విచారించవలసిన పనిలేదు. కాని నేను అడిగిన విషయమేమిటి? నీవు చెప్పే సంగతి యేమిటి !"

'సమీరు ! నీవు నిజంగా సహృదయుడవు. కాబట్టి వినతగినమాట అన్నావు. ఆ ఒక్క కళంకం ఉందనా అతనిని పనిలోంచి తీసివేయటం న్యాయమా ?

"ఛీ-ధర్మము కాదు"

అట్టివాడు ఏదో తప్పు చేస్తే నాభార్యవానిని పనిలోనుంచి తొలగించమంటే, వాడిపక్షం వహించి ఏదో విధంగా వాడిని రక్షించటం నాకు ధర్మము అంటావా ?

"ధర్మాలలోకల్లా అది ఉత్తమ ధర్మము. అట్టి నౌకరు ఉంటే, నేను వాడి పక్షం వహించి అబద్ధాలైనా ఆడి వాడిని కాపాడుతాను. కానీ ఏమిటీ గొడవ ! నా ప్రశ్నకు జవాబు చెప్పకుండా నీవో అల్లిబొల్లి కబుర్లు చెప్పి నన్ను మోసపుచ్చాలని చూస్తూ వున్నావు !"

"కాదు, కాదు, విను, నిన్ను చూస్తే నాకు నీయందు గౌరవమూ, అభిమానము ఎక్కువ అవుతుంది. నిజంగా నీ హృదయము కరుణార్ద్రము, వాడి సేవా ప్రియత్వము. మొదలైన సుగుణాలు నీవు స్వయంగా చూశావు కాబట్టి నీకు వాడి మీద అంత అభిమానమనుకుంటా."

"ఎప్పుడు చూశాను ?"

"రాముడిని నీవు తిరుణాలకు మంగళగిరి తీసుకొని పోయినావు."

"అవునవును, జ్ఞాపకం వచ్చింది. అప్పుడు, నాకు వాడు చాలా సేవ చేసినాడు, వాడేదో పిచ్చిపని చేస్తే వాడిని నేను వెనుక వేసుకొని పోట్లాడినాను."

"పిచ్చిపని యేముందీ, వడ్రంగి సోమయ్య భార్యని చూసి సౌందర్యపిపాసా బాధితుడై ఏదో అన్నాడట."

"అవును జ్ఞాపకమే" కాని ఏమిటీ గొడవ ?"

"తరువాత మా కాంతంతో ఆ విషయము అంతా ఎవరో చెప్పి, వాడు చేసేవన్నీ ఇట్టిపనులే, ఫలానవారి నౌకరు ఇటువంటి పనులు చేస్తున్నాడంటే మీకే అప్రదిష్ట,

వాడిని మీ యింట్లో నుంచి వెళ్ళగొట్టండి అన్నారట. వాడిని తీసివేయమని కాంతం పట్టుబట్టి నన్ను వేధించటం మొదలు పెట్టింది. అప్పుడేమి చెయ్యాలె ?”

“మీరు ఇంట్లోనుంచి వెళ్ళగొట్టడం అవివేకం. అట్టి మంచి నౌకరు దొరకటం దుర్లభం, ఏదో ఒక దుర్గుణం వున్నా సహించి ఊరుకోవలె.”

“మనం మొగాళ్ళం సహిస్తాము. ఆడవాళ్ళు ఇటువంటి విషయాలలో బొత్తిగా సహనం చూపరు.”

“అయితే ఒకటి చేయకపోయినావా మా చెల్లెలు కాంతం చాలా మంచిమనిషి ఏమి చెప్పినా నమ్ముతుంది. ఏదోమాట చెప్పి ఆ విషయం సద్దక పోయినావా ?”

“అబద్ధం ఆడవచ్చు నంటావా ?”

“సందేహం ఏమిటి. అటువంటి విషయాల్లో కాకపోతే ఇంకెప్పుడు అబద్ధం ఆడటం.”

“భేష్, మంచి మాట అన్నావోయి. ఈ మాట కలకాలం వుండాలె. వెధవ నౌకరును రక్షించటానికి వాడిని వెనక వేసుకొని అగ్నిసాక్షిగా పెండ్లాడిన భార్యతో అబద్దాలు చెపుతారా ? అంటావనుకొన్నాను. అప్పుడేమి చేశాననుకొన్నావు ? అబద్ధం ఆడాను.”

“మంచి పని చేశావు. కాని నన్ను పండుగకు పిలువవద్దని కాంతం అంటానికి ఆమెకు నాపై కోపం ఎందుకు వచ్చిందో ఇంతవరకూ చెప్పకుండా నన్ను మరిపించాలని చూస్తున్నావు.”

“లేదోయి, ఆ పాయింటుకే వస్తున్నా. అప్పుడేమి అబద్ధం ఆడినానో విన్నావా, సోమయ్య భార్యను దుర్భాషలాడింది రాముడు కాదన్ని, వాడితో వెళ్ళిన నీవే ఆ పని చేశావని చెప్పి ఆమె నమ్మకపోతే ఎన్నో అబద్ధాలాడి మాయంపుచ్చి నమ్మించాను.........అట్లా చూస్తావెందుకు ? ఇప్పుడేకదా అన్నాను. అట్టి నౌకరును అబద్ధం ఆడి అయినా ఆదరించాలని, అసలు కథ విను. అవును కాంతానికి రాముడిపై నున్న కోపం అంతా గిరుక్కున వెనక్కు తిరిగి నీమీద పడ్డది. అందుకని నిన్ను పండగకు పిలువవద్దు అన్నది.

తెల్లబారిన ముఖంతో "ఎంతపని చేశావోయి, కాంతంతో ఇపుడే నిజం అంతా చెప్పటానికి నే వెళ్ళుతున్నా. కథ అడ్డంగా తిరుగుతుంది చూసుకో.' అని సమీరుడు లోపలికి పోయినాడు. నేను ఆరిపోయిన సిగరెట్టును పారవేసి క్రొత్త సిగరెట్టును వెలిగించుకొని, కుర్చీలో పడుకొన్నాను. తీరా వీడు నిజము అంతా చెప్పేస్తే ఆ కోపం అంతా నామీద పడుతుందేమోరా బాబు. ఏమిటి గతీ, అని అనుకుంటూ దడదడ కొట్టుకుంటూ వున్న గుండెకు శాంతి గలుగజేయాలని ప్రయత్నం చేస్తూ వున్నాను. ఇంతలో "ఏమండోయి" అని కాంతం పిలిచింది.

"ఆం"

"ఇల్లారండి"

"ఎందుకు ? పని మీద వున్నా."

"ఏం పని ? రావాలె" అన్నది. వెళ్ళక తప్పింది కాదు. ఏమైనా కానీమని మెల్లగా అడుగులో అడుగేసుకుంటూ లోపలికి వెళ్ళాను.